## క్లుప్తంగా

### నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దాచేపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శోభారాణి బుధవారం చెప్పారు. ఎంపీపీ కటకం జయశ్రీ అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని, మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చిస్తామని, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నాలని ఆమె కోరారు.

### ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న అనిల్



దుర్గి: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన వేడకల్లో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనిల్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. బుధవారం నర్సరావుపేటలో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా అనిల్ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొంది కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా అనిల్‌కు తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్‌తో పాటు పలువురు సహ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

### పిడుగురాళ్లల్లో వర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని బుధవారం వర్షం పడింది. ఉదయం 12 గంటల సమయంలో 20 నిమిషాల పాటు వర్షం పడి, సాయంత్రం సమయంలో మరలా కొంత సమయం వర్షం పడి ఇటు రైతులను, ఎండ తీవ్రత తట్టుకోలేని ప్రజలను ఆనందపరిచింది. ఇప్పటికే పంటలను సదునుచేసుకుని విత్తనం నాటేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు, ఇప్పటికే పొలాలకు వేసిన రైతులకు మరింత మేలు చేకూరుతుందని రైతులు తెలియజేస్తున్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: మండలంలోని పందిటివారి పాలెం గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు కాగా వెంటనే ఆ వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా మృతి చెందినట్లు సీఐ పీవీ ఆంజనేయులు తెలియజేశారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి తెలుపురంగులో ఉంటాడని, 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటాయని, కాషాయ రంగు చొక్కా, కాషాయ రంగు పంచ కట్టుకుని ఉన్నాడని, ముఖం మీద తెలుపు రంగు గడ్డం ఉందని తెలియజేశారు. కుడి కాలు, ఎడమ కాలు బోదకాలువలే వాచి ఉన్నాయని, ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తు పట్టినట్లు అయితే వెంటనే పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు : 9440796236 నంబర్, లేదా ఎస్ఐ 80999910446 నంబర్‌కు సమాచారం అందించాలని తెలియజేశారు.

### అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



పిడుగురాళ్ల: మాచవరం మండలంలోని కొత్త పాలెం గ్రామానికి చెందిన మేకల చిన్ని అక్రమంగా మద్యం తరలిస్తుండగా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, బీఎంపీపీ సిబ్బంది దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఎస్. కొండారెడ్డి తెలిపారు. తెలిపిన వివరాల మేరకు చిన్ని వద్ద నుంచి 180 సీసీలు 106, 23 650 ఎంఎల్ కలిగిన బీరు సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ దాడుల్లో పీఎంపీపీ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. దీప్తి కారంత్, హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాసరావు, కానిస్టేబుల్ డి. వెంకటేశ్వరరావు, కె. మురళి నాగవర్ష, ఏ. యాకోబు తదితరులు ఉన్నారు.

# ఈ క్రాప్‌తోనే రైతుకు భరోసా

- పక్కాగా సాగు లెక్కలకు చర్యలు
- రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అధికారుల సూచన



ఈక్రాప్ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గురజాల : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి రైతులకు అండగా నిలబడుతుంది. రైతు పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారు. గతంలో అన్నదాతకు కష్టం వస్తే పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుకు కష్టం వచ్చినా ప్రభుత్వం అందించే పథకాలతో రైతులకు భరోసా కలుగుతుంది. రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాల్లో ఒకటి ఈ క్రాఫ్ బుకింగ్. విత్తనం నాటిన కాలం నుంచి ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్ముకునే వరకు అన్ని విధాల రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గత మూడు సంవత్సరాలుగా అమలు చేస్తున్న ఈ క్రాఫ్ నమోదు సత్ఫలితాలు ఇస్తోంది.

రైతు ప్రయోజనాలు లక్ష్యంగా ఈ క్రాఫ్ నిర్వహణ చేపడుతున్నారు. సకాలంలో ఈ క్రాఫ్ బుకింగ్ పూర్తి చేసి రైతులకు అండగా ఉండాలనే ఆలోచనతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మండల పరిధిలోని 32 వేల ఎకరాల వరకు సాగు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారులు తెలిపారు.

**క్రాప్ బుకింగ్ యాప్‌లో పూర్తి వివరాలు...**

వ్యవసాయశాఖకు సంబంధించిన వీఏఏలు క్షేత్ర స్థాయిలో పొలం వద్దకు వెళ్లి రైతులు సాగు చేస్తున్న పంట ఫోటోలు తీసి , పంట విస్తీర్ణం, విత్తన / నాట్లు వేసిన తేదీ, పంట పేరు తదితర వివరాలను క్షుణ్ణంగా క్రాఫ్ బుకింగ్ యాప్‌లో పొందుపరుస్తారు. సర్వే నంబర్లు వారీగా అధికారుల పర్యటనలన్నింటిని జియో ట్యాగింగ్ చేసి ఖచ్చితంగా వివరాలు లెక్కించేందుకు రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నుంచి శాటిలైట్ సహాయంతో ఇమేజస్ రూపంలో చిత్రీకరించేందుకు యాప్ దోహదపడుతుంది.

**ఈ క్రాప్ ప్రయోజనాలు ఇలా..**

ఈ క్రాప్‌లో పంట వివరాలను నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. తక్కువ ధరలకు మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడం. వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీలతో అందించడం, ఏదైనా కారణాలతో పంటకు నష్టం వాటిల్లితే బీమా వర్తింస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితి, సమకూర్చడం, పంటలను కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం విక్రయించుకునేందుకు అవకాశం కల్పించడం, ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటలను అధికారికంగా అమ్ముకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ క్రాప్‌లో నమోదు కానీ పంటలు అధికారికంగా అమ్ముకునే అవకాశం ఉండదు దీంతో ప్రైవేట్ వారిని ఆశ్రయించాల్సివస్తోంది.

**సకాలంలో ఈ క్రాప్ నమోదు...**



సకాలంలో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. ప్రతి రైతు అధికారులకు సహకరించి ఈ క్రాప్‌లో రైతులు పండించిన పంటలను నమోదు చేసుకోవాలి. ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హత సాదించడం జరుగుతుంది. ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలి రైతులు దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగివుండాలి. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం సంధ్యారాణి,
మండల వ్యవసాయాధికారిణి

## తలనీలాలు ద్వారా రూ. 33.55 లక్షలు ఆదాయం



వేలం పాటను పర్యవేక్షిస్తున్న ఈఓ నరసింహబాబు, సైదమ్మ బాయి

దుర్గి: పల్నాట ప్రసిద్ధగాంచిన శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం తలనీలాలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కును పొందేందుకు పలువురు పాల్గొన్నారు. కళ్ళే ఏడుకొండలు అనే వ్యాపారదారుడు రూ. 33,55,000 దక్కించుకున్నాడు. ఒక సంవత్సర కాల పరిమితికి గాను ది. 4-11-2023 నుంచి 3-11-2024 వరకు లైసెన్సు హక్కులు పొందాడు. గత ఏడాది కన్నా ఈ రోజు నిర్వహించిన లైసెన్సు హక్కుల ద్వారా రూ. 2,95,000లు అదనంగా దేవాలయానికి ఆదాయం వచ్చిన్నట్లు సన్నిగళ్ళ గ్రూపు టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారిణి సైదమ్మ బాయి ప్రత్యేక అధికారిగా పాల్గొని తెలిపారు. వేలం పాటకు అన్ని విధాలుగా పర్యవేక్షణ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు నేతృత్వం వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 21, 22న ఏపీఎన్‌జీఓ మహాసభ



పిడుగురాళ్ల: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 21, 22వ తేదీల్లో జరగబోయే ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు ఏపీ ఎన్‌జీఓ నాయకులు బుధవారం తెలియజేశారు. దీనిలో భాగంగానే పట్టణంలోని నీటి పారుదల శాఖ, లేబర్ ఆఫీసర్, అర్బన్ హెల్త్ సెంటర్‌లోని అధికారులకు సిబ్బందిని కలిసి సభల పోస్టర్‌ను విడుదల చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ సభలకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు దామర్ల పట్టాభి, తాలూకా సెక్రటరీ మల్లవరపు ప్రభాకర్‌రావు, జాయింట్ సెక్రటరీల మన్నవ సాగర్‌బాబు, అబ్దుల్ షాకీర్ పాల్గొన్నారు.

### తెలంగాణ మద్యం స్వాధీనం

రెంటచింతల: మండల పరిధిలోని తుమృకోట గ్రామం వద్ద అక్రమంగా తెలంగాణ మద్యం తరలిస్తున్న ఇరువురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఎం జయరావు తెలిపారు. ఘటనాకి సంబంధించిన వివరాలు కొత్తగంగరాజుపల్లెకు చెందిన ఇద్దరు 51 తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యాన్ని ద్విచక్ర వాహనం పై తరలిస్తుండగా వారికి అందిన సమాచారం మేరకు దాడి చేసి ద్విచక్ర వాహనం, ఇరువురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని గురజాల కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, మరియదాసు, సుదర్శన్ తేజ తదితరులున్నారు.

## అవయవదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా అమర్

చిలకలూరిపేట: అవయవదానంతో ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చిలకలూరిపేటశాఖ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా అమర్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూల్ ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవదానం చేయడానికి సిద్ధపడితే ఎనిమిది మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని చెప్పారు. కిడ్నీ, లివర్, గుండె, కళ్లు వంటి అవయవాలను దానం చేయవచ్చాన్నారు. మరో వైద్యుడు డాక్టర్ కందిమళ్ల వాసుదేవ్ మాట్లాడుతూ మతాచారాలు, మూఢాచారాల నుంచి బయటపడి అవయవదానానికి ముందుకు రావాలన్నారు. అవయవదానంతో చిరంజీవులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ పీవీ సుబ్బారావు, ఈదర గిరీష్‌బాబు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దేవస్థానంలో మొక్క నాటుతున్న పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

క్రోసూరు: ఆధ్యాత్మికతకు నిలయమైన దేవాలయాల్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి టి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. క్రోసూరు పరిధిలోని సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వీరభద్రమల్లేశ్వరస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాల్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సత్తెనపల్లి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతిని ఆదేశించారు. ప్రభుత్వం అర్చకులకు కల్పిస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించి లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈవోలు విజయభాస్కరరెడ్డి, ముదిగొండ పూర్ణ చంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అబాకస్ పోటీల్లో కృష్ణ వికాస్‌కు ర్యాంక్

సత్తెనపల్లి: వీవీ అబాకస్ పోటీల్లో మూడు జిల్లాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన రెడ్డి కృష్ణ వికాస్‌ను బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కృష్ణ వికాస్ రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవోప పట్టణ అధ్యక్షుడు మోటమర్రి చందు, మాజీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం సంఘం ట్రెజరర్ బచ్చు సందీప్, రెడ్డి సురేష్, స్వామి ప్రసాద్, దేవరపల్లి రాఘవ, దేవరపల్లి కాశీ విశ్వనాథం, దేవరశెట్టి కిశోర్, శ్రీను, భవాని మెడికల్స్ హరి, పొట్టి మురళి, పేరుమళ్ల శ్రీనివాస రావు, కృష్ణ వికాస్ తండ్రి రెడ్డి శీను పాల్గొన్నారు.

### ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో డ్రైడే నిర్వహించగా అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్‌రావు తెలిపారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న జక్కా పుల్లారావును అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద ఉన్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామ న్నా రు. అదేవిధంగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో పన్ను చెల్లించని గోవా రాష్ట్రానికి చెందిన మద్యంను విక్రయిస్తున్న మండది వెంకట శివనాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి వినుకొండ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

## కృష్ణా నదిలో లభ్యమైన మృతదేహం గుర్తింపు

అచ్చంపేట: మండలంలోని కోనూరు, కస్తల గ్రామాల మధ్యలో గల కృష్ణానదిలో ఈ నెల 12న కన్పించిన మృతదేహం గుర్తింపు లభించింది. అచ్చంపేటకు చెందిన షేక్ హుస్సేన్ కుమారుడు ఉస్మాన్(14)గా బుధవారం పోలీసులు గుర్తించారు. ఉస్మాన్ హోటల్లో సర్వర్‌గా పనిచేస్తూ ఈనెల 11న స్నేహి తులు రబ్బాని, సైదా అలియాస్ పండులతో కలసి కోనూరు కృష్ణానదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఉస్మాన్ కనిపించకపోవడంతో చేసేది లేక మిగిలిన ఇద్దరు ఇంటికి వెళ్లారు. కుమారుడి ఆచూకీ గురించి హుస్సేన్ వెతుకుతుండగా, దినపత్రికల్లో వచ్చిన వార్త సహాయంతో పోలీసుల్ని ఆశ్రయించారు. మార్చురీలో ఉన్న మృతదేహం తన కుమారుడు ఉస్మాన్‌దిగా ఆయన గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

## విద్యార్థులు ఉన్నతమైన స్థానాల్లో ఉండాలి

**ఎంపీపీ కటకం జయశ్రీ**



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు అందజేస్తున్న దాతలు

దాచేపల్లి : ప్రభుత్వం, దాతల ప్రోత్సాహంతో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకుని పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి ఇంక్కుర్తి నవ్యకు పిట్టల జానకీరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ రూ.10 వేలు, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి రూ. 5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన నేమాల వెంకటరమణకు ఉపాధ్యాయుడు గుడిబండి శ్రీనివాసరావు రూ.5వేలు, పిట్టల జానకీరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మరో రూ. 5వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బత్తుల అంజలికి దొండేటి సీతారామిరెడ్డి రూ.3వేలు, కటికల రమేష్ రూ.3వేలు నగదు అందించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు కూడా అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఎంపీపీ జయశ్రీ కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్ నెమలికంటి వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, ముత్యాలంపాడు ఆరిజన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు యరవెద గురవారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తాం

**సీఐ సురేంద్రబాబు**



సీఐ సురేంద్రబాబును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

దాచేపల్లి : ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తానని సీఐ ఎ. సురేంద్రబాబు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సీఐగా సురేంద్రబాబు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సురేంద్రబాబుని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ..ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకోవడం తనకు సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో ప్రజలకు మరింతగా సేవ చేస్తానని చెప్పారు. ఉన్నతాధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. సన్మానించిన వారిలో వైస్ ఎంపీపీ కందుల జాను, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, చాట్ల క్రాంతి కుమార్, దేవళ్ల ప్రసన్నలక్ష్మీ, నాయకులు కొలా జంపాలరెడ్డి, దేవళ్ల రఘు, షేక్ సైదా, కొత్రపాటి ఏర్రయ్య, బండ్ల ఏసుపాదం, నాళం శ్రీనివాసరావు, పొనాది వెంకటనారాయణ, ఉరే ముత్తయ్య, ఉప్పుతల యల్లయ్య తదితరులున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**ఏడీఏ మస్తానమ్మ**



గణపవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ, పక్కన ఏవో హరిప్రసాద్

నాదెండ్ల: పత్తి విత్తే సమయం దాటినందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. గణపవరంలోని 1వ సచివాలయంలో బుధవారం రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి విత్తే సమయం ముగిసిందని చెప్పారు. గతేడాదికన్నా ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ఆగస్టు15 తర్వాత నాటిన పత్తికి గులాబీరంగు పురుగు సోకే అవకాశం ఉన్నందున రైతులు పత్తి సాగు చేయొద్దని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలైన మిర్చి, కంది, ఇతర పంటలు సాగుచేసుకోవాలన్నారు. సెప్టెంబర్ ముగిసే సమయానికి ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ జట్టుకు హోలీ ఫ్యామిలీ విద్యార్థుల ఎంపిక

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సత్తెనపల్లి హోలీ ఫ్యామి లీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా తరపున హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థులు యశ్వంత్, ఎస్.ప్రణీత్, తులసీరామ్ పాల్గొన్నారు. ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు యశ్వంత్, ఎస్.ప్రణీత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థుల్ని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. అచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

### చర్చి ఆవరణలో అన్నదానం

యడ్లపాడు (నాదెండ్ల): మండల కేంద్రమైన యడ్లపాడులోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న, వస్త్రదానం నిర్వహించారు. చర్చి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే 50 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. వస్త్రాలు పంపిణీ చేశా రు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కారసాల బుల్లె మ్మాయి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీశ్రీనివాస రావు, తేలప్రోలు సురేష్‌కుమార్, అంకమ్మరావు, ప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి కమలాబాబు పాల్గొన్నారు.

### వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

శావల్యాపురం: వైఎస్సార్ చేయూత పథకంలో 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటి వర్గాలకు చెందిన మహిళ లబ్ధిదారులు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలోని వలంటీర్లు అర్హత కలిగిన మహిళ లబ్ధిదారుల సమగ్ర వివరాలతో కూడిన ఆధార్, రైస్‌కార్డు, కుల, ఆదాయ, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను సేకరించి, తదుపరి ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని వేల్ఫేర్ అసిస్టెంట్ పరిధిలో నూతన లబిదారుల ఆన్‌లైన్‌లో ఫొటో నమోదుతో పాటు సమగ్ర వివరాలను న మోదు చేసుకోవాలన్నారు. గతంలో పొందిన లబ్ధిదారులందరు రెన్యూవల్స్ చేయించు కోవాలన్నారు.

### ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు

బొల్లాపల్లి: వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సరికొండపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వీరనరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ప్రభు త్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లో వైద్యసేవలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 102 మందికి సాధారణ చికిత్సలు, 85 మందికి షుగర్, బీపీ, గర్భిణులు, బాలింతలు 8 మంది, 14 మంది క్యాన్సర్ అనుమానితులకు వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు రుణాలు మంజూరు

శావల్యాపురం: 7వ విడత జగనన్న తోడు పథకంలో అర్హత కలిగిన చిరు వ్యాపారులందరికీ రుణా లు మంజూరు చేయించాలని ఏపీయం జి.వాసుబాబు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకంలో ఏపీయం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 336 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడానికి లక్ష్యంగా ఎంచుకొనగా, ఇందులో భాగంగా దర ఖాస్తులు స్వీకరణతో బయోమెట్రిక్ నమోదు పనులు జరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క మహి ళా లబ్ధిదారులకు రూ. 10 నుంచి 13 వేల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రుణా లు సకాలంలో చెల్లింపులు చేసిన లబ్ధిదారులకు వడ్డీ రాయితీ ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. చైత న్య గోదావరి గ్రామీణ బ్యాంకు పరిధిలో 148 మంది లబ్ధిదారులు ఉండగా గతంలో తీసుకున్న లబ్ధిదారులు రుణాలు చెల్లింపులు సక్రమంగా లేదని అటువంటి వారిని గుర్తించి సత్వరమే చెల్లింపులు జరిగేలా క్షేత్రస్థాయిలో సీసీలు, యానిమేటర్లు, బాధ్యత వహించాలన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, బేబి రాణి, గొట్టం రమాదేవి ఉన్నారు.